క్లుప్తంగా

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శులకు సత్కారం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన వద్నాల శారద, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడకు చెందిన మామిళ్ల పార్వతిలు చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళ కార్యదర్శులుగా నియమితులైన సందర్భంగా వారిని మంగళవారం శాలువ, పూలమాలలతో సత్కరించి అభినందించారు. చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు అనుముల ఉదయ్ కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుముల ఊషన్న, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దశరథ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుర్ర నరేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ శీను, కుర్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: యూత్ ఫర్ ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ రణదీవనగర్ పాఠశాలలో చదివే 13 మంది విద్యార్థులకు మంగళవారం పుస్తకాలను పంపిణీ చేశారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పుస్తకాలను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బేర దేవన్న మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలన్నారు. ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు లక్ష్మణ్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గనగర్ కాలనీలో గల నర్సరీలో కూలీగా పని చేస్తున్న గంగుబాయితో పాటు పలువురు కూలీలపై దాడి చేసి కులం పేరుతో దూషించిన భార్యభర్తలు లక్ష్మీ, రాజేశ్వర్‌లపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఏఎస్సై యూనుస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దుర్గనగర్ కాలనీలోని ఓ నర్సరీలో లక్ష్మీ, రాజేశ్వర్‌లు సూపర్ వైజర్, వాచర్‌గా పని చేస్తున్నారు. పక్కనే మరో నర్సరీలో గంగుబాయితో పాటు పలువురు కూలీలు పని చేస్తుండగా అకారణంగా దూషించడంతో పాటు దాడి చేశారు. గంగుబాయి ఫిర్యాదు మేరకు లక్ష్మీ, రాజేశ్వర్‌లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కలప పట్టివేత

ఇచ్చోడ: మండలంలోని గుండి గ్రామ శివారులో పంట చేనులో దాచి పెట్టిన రూ.15 వేల విలువ గల కలపను మంగళవారం ఇచ్చోడ అటవీశాఖ అధికారి పుండలిక్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ముందస్తు సమచారం మేరకు అటవీశాఖ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి కలపను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కలప పట్టుకున్న వారిలో మాన్కపూర్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నాసిలాల్ పాల్గొన్నారు.

35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో సీఐ

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల 50కిలోల పీడీఎస్ బియ్యాన్ని టు టౌన్ పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. వాహన డ్రైవర్ కట్లే సాయి కుమార్, ఎస్‌కే.మోయినోద్దీన్‌లను విచారించగా ఆదిలాబాద్‌కు చెందిన ఎండీ.ముజాయిద్ అనే వ్యక్తి ఇచ్చోడకు చెందిన లకే కైలాస్‌కు విక్రయించడానికి బియ్యం తీసుకెళ్తున్నట్లుగా తెలిపారు. బియ్యం ధర రూ.71వేల విలువ ఉంటుందన్నారు. సదరు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి సివిల్ సప్లయ్ అధికారులకు బియ్యం అప్పగించినట్లుగా వివరించారు. పోలీసు సిబ్బంది నరేశ్, క్రాంతి, నరేందర్, గోపాల్, సంజు తదితరులు ఉన్నారు.

ఒకే భవనం.. మూడు కార్యాలయాలు

- ఇబ్బంది పడుతున్న సిబ్బంది
- కొత్త భవనాలు నిర్మించాలని వేడుకోలు



రెండు గదుల్లో కొనసాగుతున్న ఎంఆర్‌సీ, ఈజీఎస్ కార్యాలయాలు



మూడు కార్యాలయాలు కొనసాగుతున్న గాదిగూడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ భవనం

నార్నూర్: పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలదరి చేర్చాలనే ఉద్దేశంతో పాటు మారుమూల గ్రామాల ప్రజలు ప్రభుత్వాలు అందిస్తున్న ఫలాల కోసం పడిగాపులు పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. నూతన మండలాలు ఏర్పాటు చేసి దాదాపు ఏనిమిదేళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలు లేక ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు.

ఇరుకు గదులతో ఇబ్బంది..

గాదిగూడ మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గిరిజనులు అత్యధికంగా ఉండే ప్రాంతం కావడంతో గత ప్రభుత్వం గిరిజనులకు మంచి పాలన అందించాలనే సంకల్పంతో గాదిగూడను మండల కేంద్రంగా ప్రకటించింది. అందులో భాగంగానే తహసీల్దార్, ఎంపీడీవో, విద్యాశాఖ, వ్యవసాయం, ఈజీఎస్, ఐకేపీ కార్యాలయాలతో పాటు పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. ఏ ఒక్క దానికి సొంత కార్యాలయాన్ని మాత్రం నిర్మించలేదు. ఎంఆర్‌సీ భవనంలోనే మూడు కార్యాలయాలు కొనసాగిస్తున్నారు. భవనంలో ఉన్న మీటింగ్ హాల్‌లో ఎంపీడీవో కార్యాలయం పనులు, మిగితా రెండు గదులలో ఈజీఎస్, ఎంఆర్‌సీ(విద్యాశాఖ) కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఇరుకైనా గదిలో విధులు నిర్వహించేందుకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఫైల్స్, కంప్యూటర్‌లు పెట్టుకోవడానికి కూడా స్థలం లేక అవస్థలు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్‌ను ఎస్సీ వసతి గృహంలో, తహసీల్దార్ కార్యాలయం కమ్యూనిటీ భవన్‌లో, ఐకేపీ, పశువైద్య కేంద్రం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల సిబ్బంది నివాస గృహంలో కొనసాగుతున్నాయి. సొంత భవనాలు లేకపోవడంతో నిర్వహణ కష్టంగా మారుతోందని ఆయా శాఖల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మండలంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



2017లో కొత్త మండలం ఏర్పాటు చేశారు. కానీ కనీస సౌకర్యాలు కల్పించలేదు. మండలం ఏర్పడి దాదాపు ఎనిమిదేళ్లు అవుతునా ఇప్పటి వరకు సరిగా ఇంటర్నెట్ సౌకర్యం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇరుకైన గదుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. చాలా ఇబ్బందిగా ఉంది. సొంత భవనాలు మంజూరు చేయాలి.

– కనక ప్రభాకర్, గాదిగూడ

భవనాలు నిర్మించాలి



మండలంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ఒకే భవనంలో మూడు కార్యాలయాలకు సంబంధించిన పనులు చేస్తున్నారు. ఫైల్స్ పెట్టేందుకు కూడా స్థలం లేదు. ప్రభుత్వం స్పందించి కొత్త మండలంలో భవన నిర్మాణ పనులు చేపట్టాలి. ప్రజల కష్టాలు తీర్చాలి.

– గంగారాం, జైభారత్ టీం, గాదిగూడ

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సద్దాం

నేరడిగొండ: వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సద్దాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెచ్‌వీ స్వర్ణలత, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాజిలి గ్రామంలో వైద్య శిబిరం..

ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరు జాగ్రత్తలు పాటించాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని గాజిలి గ్రామంలో నేరడిగొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించినప్పుడు వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెచ్ఏ సాయన్న, ఆశ కార్యకర్త భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పంట అమ్మకంలో రైతుల అవస్థలు



పత్తి పంటను ఆరబెడుతున్న రైతులు

ఇంద్రవెల్లి: ఆరుగాళం కష్టపడి పండించిన పంట అమ్మకంలో కూడా రైతులకు తిప్పలు తప్పడం లేదు. తేమ శాతం ఎక్కువ ఉండడంతో అమ్మకానికి తీసుకొచ్చిన పంటను సీసీఐ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తిరస్కరించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం మండలంలోని మితల్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద మండలంలోని డొంగర్‌గాం, భీంజీతాండ గ్రామాలకు చెందిన పలువురు రైతులు పత్తి పంట అమ్మకానికి తీసుకురాగా తేమ శాతం ఎక్కువ ఉండడంతో కేంద్రం నిర్వాహకులు తిరస్కరించారు. దీంతో చేసేది లేక రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన పత్తి పంటను జిన్నింగ్ మిల్లులోనే ఆరబెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. తేమ పేరుతో రైతులు ఇబ్బందులు పడడంతో పాటు వాహనాలకు అదనంగా చార్జీలు చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నారని, జిల్లా అధికారులు దృష్టి సారించి 15 నుంచి 20 లోపు తేమ శాతం ఉన్న పత్తి పంటను ఎలాంటి కోతలు, షరుతులు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పత్తి తేమశాతంలో మినహాయింపు ఇవ్వాలి

తాంసి: రైతులు విక్రయించే పత్తిపంటకు తేమశాతంలో మినహాయింపు ఇవ్వాలని జిల్లా అఖిలపక్ష రైతు సంఘం నాయకుడు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. మంగళవారం అఖిలపక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులతో కలిసి రైతుల పక్షాన భీంపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ నలందప్రియకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అఖిలపక్ష నాయకులు గోవర్ధన్, రమేశ్, నాగయ్య, స్వామి, చిలుక దేవిదాస్ ఉన్నారు.

చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



లైబ్రరీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో రూమ్ టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం కృషి చేస్తుందన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఎంఈవో ఆశన్న, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి



రిజిస్టర్ పరిశీలిస్తున్న శ్రీధర్

తలమడుగు: రబీ సీజన్‌లో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా ఇప్పటివరకు రూ.6కోట్ల విలువైన ఎరువులు విక్రయించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యాలయంలో రిజిస్టర్లను పరిశీలించారు. సీఈవో శ్రీనివాస్, ఏవో ప్రమోద్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఫుడ్ పాయిజన్‌పై సమగ్ర విచారణ జరిపించాలి

వాంకిడి: గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నాసిరకం , కాలం చెల్లిన సరుకులు సరఫరా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి అన్నారు. మంగళవారం మండల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది నిర్లక్ష్యానికి 60 మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా కార్పొరేట్‌స్థాయి ఆసుపత్రులో వైద్యం అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఫుడ్ పాయిజన్‌పై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శులు వేముల వైష్ణవి, అజయ్‌లు పాల్గొన్నారు.

భోజనం తర్వాత విధులకు ఎగనామం



డీఆర్‌డీఏలోని అకౌంటెంట్ కుర్చీ

జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో కొంతమంది ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఇంటికి వెళ్తున్న పలువురు ఉద్యోగులు తిరిగి విధులకు రావడంలేదు. దీంతో ఆయా కార్యాలయాల్లోని ఉద్యోగుల కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



డీఆర్‌డీఏ కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు



పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో..



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో..

దండారీలకు చెక్కులు పంపిణీ

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలో ఉన్న తుమ్మగూడెం, ఇప్పమాడ గ్రామాల్లోని ఆదివాసీలకు ప్రభుత్వం నుంచి మంజూరైన దండారీ ఉత్సవాల చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ ఇప్ప సత్యనారాయణరెడ్డి, నాయకులు రాంచందర్, తదితరులు దండారీలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీలు, తదితరులు ఉన్నారు.

పొక్లెయిన్, ట్రాక్టర్లు పట్టివేత

ఖానాపూర్: పట్టణ శివారులోని వాగులోంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న పొక్లెయినర్, రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామని మంగళవారం ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి ఇసుక తరలిస్తున్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చామన్నారు. అనుమతి లేకుండా ఇసుక, మొరం దందాలు చేస్తే ఎంతటివారినైనా వదలబోమని ఎస్సై హెచ్చరించారు.

రైతు విగ్రహావిష్కరణకు రావాలి

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే రైతు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గ్రామాల్లోని మున్నూరుకాపులంతా తరలిరావాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని గోసంపల్లె, నడింపల్లె తదితర గ్రామాల్లో పర్యటించి ఆ సంఘ సభ్యులకు ఆహ్వానపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బక్కశెట్టి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, మడిగెల గంగాధర్, సిరిపురం నాగరాజు, అడిదెల రాజన్న, నిమ్మల రమేశ్, కొక్కుల ప్రదీప్, గోడపురం సందీప్, జగడం గాంధీ, కొప్పుల రాజేశ్వర్, గోండ నర్సయ్య, కొడిమెల మల్లయ్య, కొక్కుల శేఖర్, వేల్పుల లక్ష్మిరాజం, ఎడ్ల శంకర్, కొడారి గంగనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఈవోల నిరసన

కడెం: రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కడెంలోని రైతువేదికలో ఏఈవోలు నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో మండలంలోని ఏఈవోలు మాట్లాడారు. డిజిటల్ సర్వేపథకంతో రాష్ట్రంలో వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు, ఏఈవోలకు మధ్య చిచ్చు రగులుతుందన్నారు. సర్వే నుంచి మహిళా ఉద్యోగులను మినహాయించాలని.. సిబ్బందిని కేటాయిస్తే సర్వే చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలి



పుస్తకాలను అందజేస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. మంగళవారం కళాశాలలో తపాలా శాఖ ఆధ్వర్యంలో కళాశాలలోని గ్రంథాలయానికి పుస్తకాలను విరాళంగా అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని అందుకు అనుగుణంగా కష్టపడి చదవాలని సూచించారు. డిప్యూటీ పోస్టుమాస్టర్ ఉత్తమ్, కళాశాల లైబ్రేరియన్ కోటయ్య, వైస్ ప్రిన్సిపాల్ రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే ఆరోగ్యవంతమైన జీవితం



మాట్లాడుతున్న సునీత వెంకట్

తలమడుగు: ప్రతి ఒక్కరూ ఏకాగ్రతతో శ్వాసమీద ధ్యాస పెట్టి ధ్యానం చేస్తే ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్ అన్నారు. మంగళవారం మండలంలోని బరంపూర్ వెంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన ఆధ్యాత్మిక ఆత్మజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ధ్యానం చేయాలన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదరేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేశ్, ప్రతాప్, నాగారెడ్డి, రాజు, అశోక్, ఆలయ పూజారి స్వస్తిక్ స్వామి, స్వర్ణక్క, ఇంద్ర, సునీత రెడ్డి, అనిత రెడ్డి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులుగా నమోదు చేసుకోవాలి

ఎదులాపురం: కుల గణన సర్వేలో ఉపకులాల పేరుతో కాకుండా విశ్వబ్రాహ్మణుల కులంతో నమోదు చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సామన్‌పెల్లి నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ బీ గ్రూపులో వరుస క్రమంలో విశ్వబ్రాహ్మణ కులం పేరు ఉందన్నారు. నాయకులు స్వామి, హన్మండ్లు, వెంకటస్వామి, కిష్టయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప ఆలయంలో అన్నదానం

ఇచ్చోడ: మండల కేంద్రంలో అయ్యప్ప ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నుల మల్లేశ్ రెడ్డి తెలిపారు. ప్రతీ బుధవారం అయ్యప్ప ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు పత్తి కొనుగోళ్లు ప్రారంభం

నేరడిగొండ: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని దర్శన ఇండస్ట్రీస్ లఖంపూర్‌లో బుధవారం పత్తి కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు సీపీవో గణేశ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 12 శాతం లోపు తేమ ఉన్న పత్తి పంటను విక్రయించి రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు.

మండల కార్యవర్గం ఎన్నిక

గుడిహత్నూర్: మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుంజల భాస్కర్ రెడ్డి సమక్షంలో, ఉద్యమకారుడు సంజీవ్ ముండే అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కరాడ్ బ్రహ్మానంద్, ఉపాధ్యక్షులుగా ఎండీ గఫార్ ఖాన్, షగీర్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా గన్నోజి శ్రీనివాస్, కార్యదర్శులుగా రంగు శ్రీనివాస్ గౌడ్, గులే సురేశ్, కోశాధికారి బొర్రైకర్ విజయ్‌తో మరో 76 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న ధరణి రాజేశ్

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తుందని, విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఐబి చౌరస్తా నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ మాట్లాడుతూ విద్యార్థులను మోసం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలన్నారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. బాబా శ్యాం, క్రాంతి, భూమన్న, సాజిద్, జాడి వెంకటేశ్, శ్రీకాంత్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈఈ భీంరావును సన్మానించిన ఎమ్మెల్యే



భీంరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ ఈఈగా సేవలు అందించి పదవీ విరమణ పొందిన రాథోడ్‌భీంరావును మంగళవారం ఉట్నూర్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భీంరావు సేవలు అభినందనీయమని కొనియాడారు. మాజీ జెడ్పీ ఛైర్మన్ జనార్దన్ రాథోడ్, ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, సజన్, దేవేందర్ రెడ్డి, భీంరావు, లింబాజీ తదితరులు ఉన్నారు.